# అభిప్రాయభేదం

## చింతా దీక్షితులు



ఆయనకు కూతురు తప్ప ఇంకెవరూ సంతానము లేదు. ఆయన వడ్డీవ్యాపారం చేసే షాహుకారు వద్ద గుమాస్తా. ఆయన ద్వారానే షాహుకారు బదుళ్లు ఇచ్చేవాడు. ఆయనే పద్దులు వ్రాసేవాడు, అప్పులు వసూళ్లు చేసేవాడు. ఆయనకు ముప్పయి రూపాయల జీతం. ఇదిగాక నూటికి రూపాయ చొప్పున తాను బదులిప్పించిన వారి దగ్గర నుంచి రుసుము వసూలు చేసేవాడు. దానాదీనా ఆయన జీవయాత్ర గడుపుతున్నాడు. ఇల్లు కొన్నాడు, తోట వేయించాడు.

ఈమధ్యనే ఆయన భార్యకొక కాసులపేరూ, కూతిరికొక కంటె చేయించాడు. కూతురు కంటె పెట్టుకొని ఆడుకొంటూంటే తల్లిదండ్రులు చూచి సంతోషించేవారు. కూతురికి అయిదో యేడు.

ఆ ప్రాంతాన యానాది మనిషి కాపురముంది. ఆమెకు ఒక కూతురు. ఆ కూతురికి మూడోయేడు. రెండు సంవత్సరములైనది భర్త ఆమెను వదలిపెట్టి ఎక్కడికో వెళ్లి. అప్పటినుంచి ఆ యానాది మనిషి దొరికినప్పుడు కూలీనాలీ చేసుకొంటూ ఏ చెట్టుకిందో, ఏ పంచనో నిద్రపోతూ కూతురుని పెట్టుకుని కాలక్షేపం చేస్తూ ఉన్నది. రెండుమూడు రోజులపాటు తిండి దొరకనప్పుడూ కూతురుని పోషించడానికి మార్గం కనబడక ఆమె వీధులవెంట ముష్టికి బయలుదేరేది.

ఆ యానాది మనిషికి ఆ కూతురే సర్వమూ. ఇరుగుపొరుగువాళ్లను యాచించి తెచ్చుకొన్న చిరుగుచొక్కాలతోనూ, పరికిణీలతోనూ కూతురుకి ముస్తాబు చేసేది. ముస్తాబు చేసిన కూతురిని చూచి ఆ తల్లి హృదయం ఉప్పొంగేది.

నల్లని, నున్నని, బూడిద అంటిన శరీరం; చిక్కుకట్టిన నల్లని జుట్టూ; తళతళలాడి నవ్వే కళ్లూ; అకారణముగా పెదవులు విడివడడం చేత కలిగిన నవ్వూ రోజురోజూ చూచే ఆమెకు భర్తలేని లోపం కనిపించలేదు. దీనికితోడు కొంత ముస్తాబు కూతురికి చేస్తేనేకాని ఆ తల్లికి మనశ్శాంతి లేకపోయేది.

అందుకని బయళ్లలో వికసించిన తంగేడు పువ్వులు తీసుకువచ్చి ఆమె కూతురికి చెవులో జూకాలుంచేది, మెళ్లో పేరులు వేసేది.

ఒకమారు పచ్చగన్నేరు పువ్వులూ, ఒకమారు తురాయి పువ్వులూ, ఒకమారు తంగేడు పువ్వులూ సంపాదించి కూతురికి ముస్తాబు చేసేది. కానీ ఆమెకు ఇంకా తృప్తి కలగలేదు. కారణం ఏమిటంటే?

పండుగలకూ పబ్బాలకూ నాగరీకుల పిల్లలు బంగారు నగలు ధరించడం ఆమె చూచింది. అవి చాలా బాగున్నవని ఆమె అనుకుంది. తన కూతురు కూడా అలాంటి నగలు పెట్టుకుంటే ఎంత బాగుంటుందో – ఎంత బాగుంటుందో! ఆ పూటకు తిండిలేని ఆ యానాది మనిషికి బంగారు నగలు ఎక్కడ నుండి వస్తవి?

సంవత్సరాదినాడు అందరూ ముస్తాబైనారు. అందరూ వేపపువ్వు తిన్నారు.

ఆ యానాది మనిషికి సంవత్సరాదికి, ఇతర దినములకూ తేడా ఏమీ లేదు. అన్ని రోజులూ ఒక్కటే. అన్ని రోజులూ తిండికీ బట్టకూ తాపత్రయపడవలసిన రోజులే.

అప్పుడు తంగేడు పువ్వులు పూయడంలేదు. రాధామనోహరం పువ్వులూ, నందివర్ధనం పువ్వులూ కలవు. వాటితోటి ఆమె కూతురికి అలంకరించింది. కాని వెనుకటి కోరిక ఇంకా సఫలం కాలేదు. తన కూతురికి బంగారు నగలుంచి ముస్తాబుచేసి ముద్దుపెట్టుకుంటే - ముద్దు పెట్టుకుంటే -

ఆనాడు మధ్యాహ్నం కూతురిని చంకను పెట్టుకొని వీధివెంట నడచి వెళుతున్నది యానాది మనిషి. కూతురు తల్లితో ఏవేవో ఊసులాడుతున్నది.

ఒకచోట ఆయన - అంటే షాహుకారు దగ్గిర గుమాస్తా కూతురు ఆడుకుంటున్నది. కంటె మెళ్లో పెట్టుకొని ఆడుకొంటున్నది. ఆ యానాదిమనిషి ఆ పిల్లను చూచింది. ఆ కంటె చూచింది. తన కూతురికి ఆ కంటె - అలాంటి కంటె పెట్టితే - పెట్టితే ఎంత బాగుంటుందో

**రెండు కాదు ఒక్కటే...**

ఇద్దరు స్నేహితులు రోడ్డుమీద వెళ్తూంటే వారికి రెండు బాంబులు దొరికాయి.

ఒరేయ్... వీటిని తీసుకెళ్లి పోలీసులకిచ్చేద్దాం అన్నాడు ఒకడు.

వెళ్తూండగా బాంబు పేలితేనో...?

ఆ... ఏముంది... ఒక్కటే దొరికిందని అబద్ధం చెప్పేద్దాం.

- అలాంటి కంటె ఎలాగ పెట్టడం? పోనీ ఆ కంటె పెట్టితే - అమ్మో! ఆ కంటే!

ఆ తల్లిప్రాణం ఉండబట్టిందికాదు. ఆ యానాది మనిషి ఆ పిల్ల దగ్గరకు వెళ్లింది. పళ్లు పెడతానని మంచిమాటలాడింది. మెళ్లో కంటె తీసింది. తన కూతురు మెళ్లో పెట్టింది. చూచింది. తల్లిప్రాణం కుదుటపడింది. తన కూతురిని ముద్దుపెట్టుకొంది. కాని ఒక సందేహం కలిగింది. తంగేడు పువ్వుల వల్ల కలిగే అందం కంటే ఈ కంటె వల్ల ఏమి ఎక్కువ అందం కలిగింది? ఎందుకో ఈ భాగ్యవంతులు ఈలాంటి నగలు పెట్టుకుంటారు?

కంటె మెళ్లో నుంచి తీసిన తర్వాత గుమాస్తా కూతురు కెవ్వున కేకవేసింది. యానాది మనిషి భయపడింది. ఆ పిల్ల కేక విన్నవాళ్లు పరుగెత్తుకొచ్చారు. యానాది మనిషి పరుగెత్తింది భయపడి. వాళ్లు వెంటపడ్డారు. పట్టుకొన్నారు. తన్నినారు చితకామతకా ఆ యానాది మనిషిని.

కంటె తీసినట్లు ఆమె ఒప్పుకుంది. కాని కారణం చెప్పిందికాదు. ఆమె కూతురు మెళ్లో కంటె వాళ్లు తీసుకున్నారు. కూతురు ఏడ్చింది. యానాదిమనిషి కూతురు ఏడ్పు విని జాలి చెందింది.

పొట్టగడవక ఆమె దొంగతనం చేసిందని పోలీసువాళ్లకు ఆమెను అప్పచెప్పారు.

గుమాస్తా న్యాయముగా సంపాదించిన డబ్బుతో చేయించిన కంటె అన్యాయంగా దొంగిలించినందుకు యానాదిమనిషి కొంతకాలం చెరసాలలో కూతురుతోకూడా ఉండవలసి వచ్చింది. దొంగతనము చేసినందుకేనని ప్రజలన్నారు. తన కూతురికి ముస్తాబు చేసినందుకని ఆమె అనుకొన్నది.